క్లుప్తంగా

దుబ్బాకలో బీఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయం


నియామకపత్రాలు అందిస్తున్న వంశీకృష్ణగౌడ్

దుబ్బాక: వచ్చే ఎన్నికల్లో దుబ్బాకలో బీఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయమని బీఆర్ఎస్ పార్టీ దుబ్బాక మున్సిపల్ అధ్యక్షుడు పల్లె వంశీకృష్ణగౌడ్ అన్నారు. శుక్రవారం దుబ్బాక మున్సిపల్ పరిధిలోని దుంపలపల్లి వార్డు 50, 51 బూత్‌లలో అధ్యక్షులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 50వ బూత్ బీఆర్ఎస్ అధ్యక్షుడిగా బిజ్జ లింగయ్య, 51వ బూత్ అధ్యక్షుడిగా ధర్మారెడ్డి రఘునందన్‌రెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నామన్నారు. ఈ మేరకు ఎన్నికైన అధ్యక్షులకు నియామకపత్రాలు అందించారు. ఉపఎన్నికల్లో దొంగ హామీలతో ప్రజలను మోసం చేసి గెలిచిన ఎమ్మెల్యే రఘునందన్‌రావుకు వచ్చే ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు.

రైతుబంధు దరఖాస్తుల స్వీకరణ


దరఖాస్తులను స్వీకరిస్తున్న ఏఈఓ శ్రీలత

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని జనగామ గ్రామ రైతువేదికలో కొత్తగా పట్టాపాస్‌బుక్స్ పొందిన పలువురు రైతులు రైతుబంధుకు దరఖాస్తులు చేశారు. కాగా శుక్రవారం వ్యవసాయ విస్తరణాధికారి శ్రీలత వారి దరఖాస్తులను స్వీకరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఈ నెల 26వ తేదీలోపు రైతుబంధుకు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. పట్టాపాస్‌బుక్ జిరాక్స్, ఆధార్‌కార్డు, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్, రైతుబంధు అప్లికేషన్ దరఖాస్తులను జతచేసి ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

విద్యార్థులు చక్కగా చదువుకోవాలి

నంగునూరు(సిద్దిపేట): దాతల సహకారంతో అన్ని వసతులు సమకూరుతున్నందున విద్యార్థులు చక్కగా చదువుకోవాలని అక్కేనపల్లి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రవీందర్‌గౌడ్ అన్నారు. మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్‌రెడ్డి ఆర్థికసాయంతో మోడల్ స్కూల్ విద్యార్థులకు శుక్రవారం ఉచిత బస్‌పాస్‌లు అందజేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ సిద్దిపేట బస్‌డిపో మేనేజర్ సుఖేందర్‌రెడ్డి, సర్పంచ్ వెంకటేశం, ఎంపీటీసీ తిరుపతి, కృష్ణారెడ్డి, తిరుపతి, రాజుగౌడ్, సత్యనారాయణ, బాలకిషన్ పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను ప్రజలకు వివరించాలి


కరపత్రాలను అందజేస్తున్న నాయకులు

మద్దూరు(హుస్నాబాద్): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను రాష్ట్ర ప్రజలకు వివరించాలని బీజేపీ జనగామ నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనర్ బల్ల శ్రీనివాస్ అన్నారు. గురువారం మద్దూరు మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో గడపగడపకూ కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి పథకాల కరపత్రాలను, స్టిక్కర్లను పంపిణీ చేశారు. రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ జెండా ఎగరవేసేందుకు కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో జనగామ జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు బీరప్ప, బీజేవైఎం జిల్లా కార్యదర్శి మనోజ్ కుమార్, నాయకులు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అవగాహన పెంచుకోవాలి

జగదేవ్‌పూర్(గజ్వేల్): సైబర్ మోసాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ కృష్ణమూర్తి అన్నారు. శుక్రవారం మండలంలోని మునిగడప జెడ్పీ ఉన్నత పాఠశాలలో షీటీమ్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే అన్ని అంశాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. సోషల్ మీడియా వేధింపులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం రహీం, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు శశిధర్‌శర్మ, సర్పంచ్ బాల్‌లక్ష్మి, షీటీమ్ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోహెడ(హుస్నాబాద్): విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని షీటీమ్ డబ్ల్యూహెచ్‌సీ తార అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మహిళల భద్రత, సైబర్ క్రైమ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం ప్రభాకర్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది మల్లేశం, రజిత పాల్గొన్నారు.

కరెంట్ కష్టాలు తీరేదెప్పుడో?

- దుబ్బాకలో తీవ్రమైన సమస్య
- ప్రతిరోజు ప్రజల నరకయాతన
- పట్టించుకోని విద్యుత్ అధికారులు

దుబ్బాకటౌన్: రెప్పపాటు కూడా కరెంట్ పోకుండా 24 గంటల కరెంటు ఇస్తున్నామంటూ ప్రభుత్వం చెబుతుంటే.. ఇందుకు విరుద్ధంగా కరెంట్ ఎప్పుడు ఉంటుందో.. ఎప్పుడు పోతుందో తెలియని అయోమయ పరిస్థితులు నియోజకవర్గ కేంద్రమైన దుబ్బాకలో నెలకొన్నాయి. ఈ సమస్యపై పలుమార్లు ఎమ్మెల్యే రఘునందన్‌రావు, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిలు సైతం విద్యుత్ అధికారులతో సమీక్షించి చర్యలు తీసుకోవాలని సూచించినా పరిష్కారం కాకపోవడం శోచనీయం. ఈ సమస్య గతంలో సైతం తీవ్రంగా ఉండడంతో శాశ్వతంగా ఈ సమస్యకు చెక్ పెట్టాలన్న ఆలోచనతో అప్పటి ఎమ్మెల్యే దివంగత సోలిపేట రామలింగారెడ్డి సీఎం కేసీఆర్, ట్రాన్స్‌కో సీఎండీల దృష్టికి తీసుకెళ్లి ప్రత్యేకంగా రామసముద్రం ప్రాంతంలో డొమెస్టిక్ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను గత 4 సంవత్సరాల క్రితం ఏర్పాటు చేయించారు. దీంతో కొద్దినెలలు ఎలాంటి సమస్య రాలేదు. మళ్లీ 2 సంవత్సరాలుగా పట్టణంలో సమస్య మొదలైంది. ఏళ్లుగా కరెంట్ సమస్యతో ప్రజలు తీవ్రఇబ్బందులు పడుతున్నా సంబంధిత బాధ్యత గత విద్యుత్ అధికారులు పరిష్కరిస్తామంటూ చెప్పడమే తప్పా ఇంతవరకు పట్టించుకున్న దాఖలాలు లేకపోవడంతో ప్రజలు చాల ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోని ప్రజలతో పాటు చిరు వ్యాపారులు, ముఖ్యంగా జిరాక్స్, ఇంటర్‌నెట్, బేకరీలు, కార్పెంటర్లు, పిండి గిర్నీలు, ఫొటో స్టూడియోతో పాటు చాలా రకాల వ్యాపారులు సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు.


దుబ్బాక పట్టణ వ్యూ

గతంలో కాలిపోయిన ఎలక్ట్రానిక్ పరికరాలు

పట్టణంలోని లాల్ బహదూర్ శాస్త్రీ విగ్రహం వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌లో సమస్య తలెత్తడంతో ఆ ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలోని చాలా ఇళ్లలో గత నాలుగు నెలల క్రితం ఎలక్ట్రానిక్ పరికరాలు కాలిపోయాయి. దీంతో సుమారుగా రూ.20 లక్షలకుపైగా ఆస్తి నష్టం వాటిల్లింది. 50కి పైగా టీవీలు, 10 రిఫ్రిజిరేటర్లు, 20కిపైగా కంప్యూటర్లు, జిరాక్స్ మిషన్లు, ప్రింటర్లు, ఫ్యాన్లు, బల్బులతో పాటు చాలా రకాల విద్యుత్ పరికరాలు కాలిపోయాయి.

ఆందోళన వ్యక్తం చేస్తున్న ప్రజలు

కరెంట్ సమస్యపై ఎన్నోసార్లు విద్యుత్ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదంటూ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ అధికారులకు ఫోన్ చేస్తే పూర్తిగా నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే రఘునందన్‌రావు, ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి, విద్యుత్ ఉన్నతాధికారులు స్పందించి పట్టణంలో సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.


దుబ్బాకలో కొత్తగా ఏర్పాటు చేసిన డొమెస్టిక్ విద్యుత్ సబ్‌స్టేషన్

చాలా ఇబ్బందులు పడుతున్నాం



పట్టణంలో ప్రతిరోజు కరెంట్ ఎప్పుడు పోతదో ఎప్పుడు వస్తదో తెలియని అయోమయ పరిస్థితులు నెలకొన్నాయి. గంటల తరబడి కరెంట్ లేకపోవడంతో ఉక్కపోత, దోమల బెడదతో చాలా ఇబ్బందులు పడ్డాం. ఏదో ఒక్కరోజు కాదు తరచుగా సమస్య తలెత్తుతుండడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్యకు విద్యుత్ అధికారులు శాశ్వతంగా పరిష్కారం చూపి ప్రజల ఇబ్బందులు తొలగించాలి.

–ఎల్లారం రమేశ్, దుబ్బాక

పట్టించుకోవడం లేదు



పట్టణంలో కరెంట్ సమస్య తీవ్రంగా ఉంది. ఈ సమస్యను పరిష్కరించాలని ఎన్నోసార్లు సంబంధిత అధికారులకు చెప్పినా ఫలితం లేదు. ఎంపీ ప్రభాకర్‌రెడ్డి సైతం పలుమార్లు కరెంట్ సమస్య పరిష్కరించాలని ఆదేశించినా చర్యలు చేపట్టలేదు. ప్రతిరోజు కరెంట్ సమస్య తలెత్తుతుంది. బుధవారం రాత్రి చాలా కాలనీల్లో కరెంట్ లేకపోవడంతో ప్రజలు చాలా ఇబ్బందులు పడ్డారు. విద్యుత్ ఉన్నతాధికారులు కరెంట్ సమస్యపై వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకోవాలి.

–ఆస యాదగిరి, 14వవార్డు కౌన్సిలర్, దుబ్బాక

చర్యలు తీసుకుంటాం



దుబ్బాక పట్టణంలో నెలకొన్న కరెంట్ సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. చెట్లకొమ్మలు గాలికి పడుతుండడంతో సమస్య నెలకొందని అందుకే బుధవారం రాత్రి కొన్ని కాలనీల్లో కరెంట్ పోయినట్లు తన దృష్టికి వచ్చింది. పట్టణంలో చాలా కాలంగా ఉన్న విద్యుత్ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు తప్పకుండా తగు చర్యలు తీసుకుంటాం. మళ్లీ ఇలాంటి సమస్యలు తలెత్తకుండా ఏఈ, ఏడీలను అందుబాటులో ఉంచి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూస్తాం.

–మహేశ్‌కుమార్, డీఈఈ, సిద్దిపేట

బోనాల జాతరను విజయవంతం చేయండి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఈ నెల 25న ఆషాఢ మాసం అమ్మవార్లకు తొలి బోనం సమర్పించనున్నట్లు కుమ్మరి సంఘం జిల్లా అధ్యక్షుడు దరిపల్లి శ్రీను అన్నారు. శుక్రవారం సిద్దిపేటలో నిర్వహించిన జిల్లాస్థాయి కుమ్మరి సంఘం సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీను మాట్లాడుతూ.. ఈ నెల 25న (ఆదివారం) సిద్దిపేటలో 108 బోనాలతో శరభేశ్వర ఆలయం, లాల్‌కమాన్, వేంకటేశ్వర ఆలయ ఆవరణ మీదుగా కోమటి చెరువు వరకు చేరుకొని కోమటి చెరువు కట్టపై ఉన్న మైసమ్మకు బోనాలు సమర్పిస్తామన్నారు. ఈ కుమ్మర్ల తొలి బోనాల జాతరలో మంత్రి హరీశ్‌రావు పాల్గొననున్నట్లు తెలిపారు. అధిక సంఖ్యలో కుమ్మర్లు బోనాలతో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ సందర్భంగా బోనాల ఉత్సవ కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ చైర్మన్‌గా కట్కూరి రవీందర్, వైస్ చైర్మన్‌గా దరిపల్లి ప్రసన్న కుమార్, డైరెక్టర్లుగా మూడపల్లి భూమయ్య, దరిపల్లి శ్రీనివాస్, గోవిందారం శ్రీశైలం, అకునూరి శ్రీనివాస్, నెల్లుట్ల ప్రశాంత్, అనంతారం నగేశ్, గోవిందారం సంతోష్, నాంపల్లి బాలకిషన్, నెల్లుట్ల రాజు, దరిపల్లి కుమార్, మర్పడ్గ కిషన్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నెల్లుట్ల విజయ్, వర్కొలు శ్రీనివాస్, నార్లపురం తిరుపతి, శాతరాషి రాజు, సాయిబాబ, రమేశ్, రాములు, ఆంజనేయులు, మహేశ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


ఉత్సవ కమిటీ సభ్యులకు సన్మానం

తొలకరి పలకరింపు


చేర్యాలలో కురుస్తున్న వర్షం

చేర్యాల(సిద్దిపేట): పట్టణ కేంద్రంతో పాటు మండల పరిధిలోని పలు గ్రామాల్లో శుక్రవారం మధ్యాహ్నం వర్షం కురిసింది. వర్షాకాలం ప్రారంభమైనా వానలు కురవక ఎదురుచూస్తున్న రైతన్నలకు తొలకరి పలకరింపుతో కొద్దిగా ఊరట లభించిందని చెప్పవచ్చు. చేర్యాలలో 25.మి.మీ వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

వితంతువులు ఆత్మస్థైర్యం కోల్పోవద్దు

జగదేవ్‌పూర్(గజ్వేల్): వితంతువులు ఆత్మస్థైర్యం కోల్పోవద్దని, మనోధైర్యంతో ముందుకు సాగాలని సర్పంచ్ లక్ష్మీచంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీటీసీ కవితశ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ వితంతువుల దినోత్సవం సందర్భంగా మండలంలోని అలిరాజ్‌పేట గ్రామంలో ఎస్పీవీ రోస్ సంస్థ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చిన్న వయస్సులోనే వితంతువులుగా మారడం చాలా బాధాకరమన్నారు. కుటుంబ పరిస్థితులకు అనుకూలంగా స్వయం ఉపాధి వైపు అడుగులు వేయాలని సూచించారు. వితంతువులు సమాజంలో సమానమేనని, మూఢ నమ్మకాల ముసుగులో మునిగి ఆత్మస్థైర్యం కోల్పోవద్దని సూచించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు చంటి, సంస్థ డైరెక్టర్ సవిత సిస్టర్, ఉపసర్పంచ్ రమేశ్, సిబ్బంది శ్వేత, స్వాతి, వితంతువులు పాల్గొన్నారు.

హుస్నాబాద్‌రూరల్: గ్రామీణ ప్రాంతంలో వితంతువులపై సాటి మహిళలు ఎవరూ వివక్ష చూపొద్దని బాలవికాస వాటర్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కేడం లింగమూర్తి అన్నారు. శుక్రవారం వితంతువు దినోత్సవం పురస్కరించుకొని తోటపల్లిలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వితంతువులపై జరుగుతున్న వివక్షతను సాటి మహిళలు కలిసికట్టుగా రూపుమాపేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బాలవికాస ప్రతినిధులు జ్యోతి, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

వివక్ష వీడాలి

సిద్దిపేటరూరల్: గ్రామాల్లో ప్రజలు వితంతువులపై వ్యతిరేక వైఖరిని విడనాడి సమైఖ్యతా భావంతో మెదలాలని బాలవికాస మహిళా కోఆర్డినేటర్ లక్ష్మి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని వెంకటాపూర్ గ్రామంలో బాలవికాస ఆధ్వర్యంలో వితంతువులపై వివక్షపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.


హుస్నాబాద్‌రూరల్: మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేస్తున్న మహిళలు

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు


చిన్నకోడూరులో..


అక్కన్నపేట: తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు, వ్యవసాయ అధికారులు

అక్కన్నపేట(హుస్నాబాద్): ఎవరైన రైతులకు నకిలీ విత్తనాలు విక్రయించి మోసం చేస్తే చర్యలు తీసుకుంటామని సీఐ ఎర్రల కిరణ్ అన్నారు. మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ షాపులపై పోలీసులు, వ్యవసాయ అధికారులు శుక్రవారం సాయంత్రం ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఫర్టిలైజర్ షాపుల్లో నిల్వ ఉన్న విత్తనాలు, ఎరువుల వివరాలను పరిశీలించి, రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్సై వివేక్, వ్యవసాయ విస్తరణాధికారి సబియా, సిబ్బంది పాల్గొన్నారు.

తొగుట(దుబ్బాక): నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని తొగుట ఎస్ఐ కర్ణాకర్‌రెడ్డి హెచ్చరించారు. వ్యవసాయాధికారి మోహన్‌తో కలిసి శుక్రవారం మండలంలోని విత్తన దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఏఎస్ఐ రాంరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నకోడూరు(సిద్దిపేట): మండలంలోని విత్తనాల షాపులు, పురుగుమందుల షాపులను శుక్రవారం ఎస్ఐ శివానందం సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. స్టాక్ రిజిస్టర్, డెలివరీ రిజిస్టర్, బిల్ బుక్‌లను పరిశీలించారు. శాపులో ఉన్న విత్తనాలు, పురుగుల మందులు బస్తాలను పరిశీలించారు. నకిలీ విత్తనాలు, పురుగుల మందులు విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ హెచ్చరించారు.

కోహెడ(హుస్నాబాద్): మండల కేంద్రంలోని పలు సీడ్స్ అండ్ ఫర్టిలైజర్ షాపుల్లో ఎస్ఐ నరేందర్‌రెడ్డి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విత్తనాలు, పురుగుల మందుల విక్రయాలపై ఆరా తీశారు. నకిలీ విత్తనాలు, మందులు విక్రయిస్తే. 8712667100కు సమాచారంఇవ్వాలన్నారు.

మిరుదొడ్డి(దుబ్బాక): రైతుల అమాయకత్వాన్ని ఆసరా చేసుకొని నకిలీ విత్తనాలను విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని మండల వ్యవసాయ అధికారి మల్లేశం ఫెస్టీసైడ్ డీలర్లను హెచ్చరించారు. మండల కేంద్రమైన మిరుదొడ్డిలో ఎస్ఐ శ్రీధర్ గౌడ్‌తో కలిసి శుక్రవారం పలు ఎరువులు, విత్తన దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఏఈఓ ఆరేటి లోహిత్ పాల్గొన్నారు.

నంగునూరు(సిద్దిపేట): మండలంలోని ఆగ్రోస్ సేవా కేంద్రంతో పాటు పాలమాకుల, ముండ్రాయి గ్రామాల్లోని ఎరువులు, విత్తనాల షాపులను శుక్రవారం వ్యవసాయ, పోలీస్ అధికారులు తనిఖీ చేశారు. ఎస్ఐ రాజుగౌడ్, ఏఓ గీత మాట్లాడుతూ.. కల్తీ విత్తనాలు అమ్మితే చర్యలు తప్పవన్నారు.

వర్గల్(గజ్వేల్): మండలంలోని నెంటూరు, మజీద్‌పల్లి గ్రామాల విత్తన దుకాణాలను వ్యవసాయ, పోలీస్ అధికారులు ఆకస్మిక తనిఖీ చేశారు. ఏఓ శేషశయన, బేగంపేట ఎస్సై అరుణ్ ఆధ్వర్యంలో స్వాతి, స్వర్ణ, క్రాంతి బృందం ఆయా దుకాణాల్లో విత్తన బస్తాలను క్షుణ్ణంగా పరిశీలించారు.

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని ఎరువులు, విత్తనాల దుకాణాలను శుక్రవారం బెజ్జంకి ఎస్ఐ ప్రవీణ్‌రాజ్, ఏఓ సంతోష్‌లు ఆకస్మికంగా తనిఖీ చేశారు. విత్తనాలు, బిల్లులను పరిశీలించారు.

ప్రజలకు వారధిగా నిలవాలి

- కొండపాక సమావేశంలో రైతుబంధు సమితి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రవీందర్

కొండపాక(గజ్వేల్): ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రజలకు వారధిగా నిలవాలని రైతుబంధు సమితి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు దేవి రవీందర్ సూచించారు. మండల కేంద్రమైన కొండపాకలోని రైతువేదిక భవనంలో శుక్రవారం ఎంపీపీ ఉపాధ్యక్షుడి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవి రవీందర్ మాట్లాడుతూ.. సమస్యలపై స్థానిక ప్రజాప్రతినిధులు ఫోన్లు చేస్తుండగా అధికారులు స్పందించకపోవడం సరికాదన్నారు. వర్షాకాలం సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్యాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మన బడి పథకంలో ప్రారంభమైన పనులు తొందరగా పూర్తయ్యేలా చూడాలన్నారు. వడగళ్లతో మండల వ్యాప్తంగా 2593 ఎకరాల్లో దెబ్బతిన్న వరి పంట నష్టపరిహారం త్వరలో రైతుల అకౌంట్లో ప్రభుత్వం జమ చేస్తుందన్నారు. అభివృద్ధిలో మండల ఆదర్శంగా నిలిచేలా కృషి చేద్దామన్నారు. కొండపాక, కుకునూరుపల్లి మండలాల్లో 100శాతం ఉత్తీర్ణతను సాధించడంపై ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డిని, ఉత్తమ వైద్య సేవలందించడంలో రాష్ట్రస్థాయిలో అవార్డు వచ్చేలా పనిచేసిన వైద్యులు బల్‌భీర్‌సింగ్‌లను ప్రత్యేకంగా అభినందించారు.


మాట్లాడుతున్న రవీందర్

పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలి

గ్రామాభివృద్ధికి అప్పులు చేసి ప్రభుత్వం మంజూరు చేసిన పనులు చేసి ఏడాది గడుస్తున్నా బిల్లులు మంజూరు కాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామంటూ సిర్సనగండ్ల గ్రామ సర్పంచ్ గూడెపు లక్ష్మారెడ్డి సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. బొబ్బాయిపల్లిలో వీధిలైట్ల కోసం ఇనుప విద్యుత్తు స్తంభాలు ఉండడంతో వర్షాకాలంలో పశువులు, ప్రజలు విద్యుత్ షాక్‌లకు గురవుతున్నారంటూ సర్పంచ్ కోల శ్రీనివాస్ సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. తిమ్మారెడ్డిపల్లి గ్రామంలో వ్యవసాయ బావులకు, గ్రామంలోకి ఒకే ఫీడర్ ద్వారా విద్యుత్ సరఫరా జరుగుతుందని, ఎక్కడ ఏ చిన్న సమస్య తలెత్తినా రెండు చోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని సర్పంచ్ మల్లమారి రవీందర్ సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాంరెడ్డి, తహసీల్దార్లు రామేశ్వర్, ఆశాజ్యోతి, ఎంపీఓ వీరరాజు, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు చింతల సాయిబాబ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

శ్యాంప్రసాద్ ముఖర్జీ సేవలు మరువలేనివి

హుస్నాబాద్: జన సంఘ్ వ్యవస్థాపకుడు శ్యాంప్రసాద్ ముఖర్జీ వర్ధంతి, బలిదాన్ దివాస్ సందర్భంగా పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో శుక్రవారం బీజేపీ నాయకులు ఆయనను స్మరిస్తూ నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్‌బాబు, సెంట్రల్ ఫిలిం సెన్సార్ బోర్డు మెంబర్ లక్కిరెడ్డి తిరుమల, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి రామంచ మహేందర్‌రెడ్డి, అసెంబ్లీ కో–కన్వీనర్ వేణుగోపాల్‌రావు, మండల అధ్యక్షుడు విద్యాసాగర్‌రెడ్డి, జిల్లా మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి స్వరూప, నాయకులు ఉన్నారు.

దుబ్బాక: అఖండ భారతావని కోసం ప్రాణ త్యాగం చేసిన శ్యాంప్రసాద్ ముఖర్జీ సేవలు మరువలేనివని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అంబటి బాలేశ్‌గౌడ్ అన్నారు. శుక్రవారం శ్యాం ప్రసాద్ ముఖర్జీ బలీదాన్ దివాస్ సందర్భంగా దుబ్బాక పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు ఎస్ఎన్ చారీ, గాజుల భాస్కర్, వెంకట్‌గౌడ్, స్వామి, అమర్, రవీందర్, యాదగిరి, రమణారెడ్డి ఉన్నారు.


హుస్నాబాద్: నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

గజ్వేల్‌రూరల్: డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ సేవలు మరువలేనివని బీజేపీ, బీజేవైఎం నాయకులు కొనియాడారు. శుక్రవారం గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ముట్రాజ్‌పల్లిలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు మనోహర్ యాదవ్, బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి శివకుమార్, బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ శేఖర్, నాయకులు శ్రీనివాస్, భూదయ్య తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ ఏబీఎస్‌బీ వార్షికోత్సవాలను జయప్రదం చేయండి

చేర్యాల(సిద్దిపేట): అఖిల భారత విద్యార్థి బ్లాక్ 73వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను జయప్రదం చేయాలని మండల కార్యదర్శి బోగి మనోహర్ పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణ కేంద్రంలో ఏబీఎస్‌బీ ఆవిర్భావ వేడుక వాల్‌పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడుతూ.. 72 ఏళ్లుగా విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తున్న ఏబీఎస్‌బీ 73వ వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా జిల్లా కమిటీ పిలుపు మేరకు పట్టణ కేంద్రంలో వార్షికోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. వేడుకలకు అధిక సంఖ్యలో ప్రజలు హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు కరణ్, అజయ్, చరణ్, లక్ష్మణ్, భార్గవ్, నవీన్, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

◆ టీఎస్‌బీసీ చైర్మన్‌కు పరామర్శ

సిద్దిపేటకమాన్: టీఎస్‌బీసీ చైర్మన్ గ్యాదరి బాలమల్లు మాతృమూర్తి కమలమ్మ ఇటీవల మరణించడంతో సిద్దిపేటలోని వారి కుటుంబాన్ని టీఎస్ఎమ్ఎస్ఐడీసీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ శుక్రవారం పరామర్శించారు. వీరి వెంట బీఆర్ఎస్ పార్టీ నాయకులు పలువురు పాల్గొన్నారు.

◆ నాయీ బ్రాహ్మణుల సంక్షేమానికి చొరవ చూపాలి

గజ్వేల్‌రూరల్: నాయీ బ్రాహ్మణుల సంక్షేమానికి ప్రభుత్వం చొరవ చూపాలని నాయిబ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి విద్యాకర్‌నాయీ పేర్కొన్నారు. శుక్రవారం గజ్వేల్ పట్టణంలో ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కృష్ణ, వెంకటేశ్, యాదగిరి, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

◆ ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ సదస్సును విజయవంతం చేద్దాం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఈ నెల 25న జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ అనుబంధ సంఘాల సదస్సుకు మాదిగ రిజర్వేషన్ సమితి జాతీయ అధ్యక్షుడు మందకృష్ణమాదిగ హాజరుకానున్నారని, ఈ సదస్సును విజయవంతం చేద్దామని ఎమ్మెస్పీ జిల్లా కన్వీనర్ లింగంపల్లి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో లింగంపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఈ సదస్సుకు జిల్లా నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరుకావాలన్నారు. అనంతరం గాడిచర్లపల్లిలో ఎమ్మెస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి పెర్క పరశురాములు ఆధ్వర్యంలో ఎమ్మెస్పీ కమిటీని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మల్లిగారి యాదగిరి, సామ్రాట్ ప్రకాశ్, పెరిక పరశురాములు, జేరిపోతుల లక్ష్మణ్, కొలిమి మల్లేశం, రమేశ్, రాజు, పవన్‌కళ్యాణ్, ప్రశాంత్, స్వామి, కనకయ్య, లింగం, రవి, పెద్దమల్లయ్య, నర్సింలు, రాజు, బాలకిషన్ పాల్గొన్నారు.

◆ సీసీరోడ్డు పనులు ప్రారంభం

తొగుట(దుబ్బాక): మండలంలోని లింగంపేట గ్రామంలో రూ.10లక్షలతో నిర్మించనున్న సీసీరోడ్డు పనులను సర్పంచ్ మంగ రేణుకానర్సింలు శుక్రవారం ప్రారంభించారు. మండల కేంద్రానికి వెళ్లే బీటీరోడ్డు నుంచి బీసీ కాలనీ వరకు సీసీరోడ్డు నిర్మిస్తున్నట్టు సర్పంచ్ తెలిపారు. గ్రామాభివృద్ధికి నిధులు మంజూరు చేసిన ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ సుదర్శన్, మాజీ సర్పంచ్ రవి, బీఆర్ఎస్ నాయకులు ఐలయ్య, షేక్ ఆబిద్ హుస్సేన్, ధనుంజయ, రవి, భిక్షపతి, రాజయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

◆ వెలిశాల పాట సభకు తరలిరండి

హుస్నాబాద్: ప్రముఖ సినీగీత రచయిత మిట్టపల్లి సురేందర్ రాసిన తల్లీ నా వెలిశాల పాటకు ఇరువై ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ నెల 25న వెలిశాల గ్రామంలో మిట్టపల్లి మిత్రమండలి ఏర్పాటు చేసిన ఆత్మీయ సభకు కవులు, కళాకారులు, సాహిత్యాభిమానులు అధిక సంఖ్యలో తరలిరావాలని సాహిత్య, సాంస్కృతిక సారథి వ్యవస్థాపక అధ్యక్షుడు ముక్కెర సంపత్‌కుమార్ పిలుపునిచ్చాడు. శుక్రవారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కళాకారులు తాడూరి సురేశ్, కనకం వెంకట్, రాజ్ కుమార్, శ్రీధర్, సామ్రాట్ పాల్గొన్నారు.

◆ భగవంతుడి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి

గజ్వేల్‌రూరల్: భగవంతుడి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని బీఆర్ఎస్ నాయకులు, డీసీసీబీ డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి పేర్కొన్నారు. గజ్వేల్–ప్రజ్ఞాపూర్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించతలపెట్టిన న్యాజ్ కార్యక్రమం కోసం రూ.21వేల విరాళం అందజేశారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు స్వామి, నరేశ్, అశోక్, మహ్మద్ అక్బర్, పోచయ్య, అక్బర్‌పాషా, నవీన్‌కుమార్, చంద్రయ్య,శ్రీనివాస్, కాశీం, సాయిబాబ పాల్గొన్నారు.

◆ సాగులో మెళకువలు పాటించాలి

మద్దూరు(హుస్నాబాద్): నైరుతి రుతుపవనాలు ప్రవేశించడంతో మండలంలో అక్కడక్కడ వర్షాలు కురుస్తున్న సమయంలో రైతులు పలు జాగ్రత్తలు, సూచనలు పాటించాలని మండల వ్యవసాయాధికారి రామకృష్ణ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం రామకృష్ణ పర్యటించి రైతులకు సాగు మెళకువలు తెలిపారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ.. వరిసాగు చేసే రైతులు నారుమడి ఎంచుకునేటప్పుడు దీర్ఘకాలిక లేదా స్వల్పకాలిక రకాలు మాత్రమే ఎంచుకోవాలన్నారు. పత్తి విత్తనాలు జూలై 15 వరకు విత్తుకోవచ్చన్నారు. అంతర్ పంటగా కందిసాగు చేసుకోవచ్చని, కంది విత్తనాలు ఆగస్టు 15 వరకు విత్తుకోవచ్చన్నారు.

◆ మతిస్థిమితం లేని వ్యక్తికి సపర్యలు

గజ్వేల్‌రూరల్: మతిస్థిమితం లేని ఓ వ్యక్తికి పట్టణంలోని 20వ వార్డు కౌన్సిలర్ వంటేరు గోపాల్‌రెడ్డితో పాటు కొండపోచమ్మ దేవస్థాన డైరెక్టర్ రమేశ్, నాయకులు శ్రీనివాస్‌లు సపర్యలు చేశారు. మతిస్థిమితం లేని అశోక్ అనే వ్యక్తి గత కొంతకాలంగా గజ్వేల్ పట్టణంలో తిరుగుతున్నట్లు గుర్తించారు. శుక్రవారం కౌన్సిలర్ గోపాల్‌రెడ్డి సూచనల మేరకు మతిస్థిమితం లేని వ్యక్తికి స్నానం చేయించడంతో పాటు కొత్తబట్టలను అందించి సపర్యలు చేయడంపై వారిని పలువురు అభినందిస్తున్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
యం. నాగరాజు-9010957373
రమేష్ - 9951952990